క్లుప్తంగా

ఇఫ్టూ నేత అప్పారావుకు గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన అప్పారావు

ఏలూరు (టూటౌన్): రోడ్డు ప్రమాదంలో ఇఫ్టూ నగర అధ్యక్షుడు కాకర్ల అప్పారావుకి గాయాలయ్యాయి. శనివారం ఉదయం కొబ్బరితోటలోని తన నివాసం నుంచి ఇఫ్టూ కార్యాలయానికి సైకిల్‌పై వస్తుండగా జూట్ మిల్లు సెంటర్లో వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టింది. దీంతో అప్పారావు కాలు పూర్తిగా దెబ్బతింది. విషయం తెలుసుకున్న ఇఫ్టూ నాయకులు యు.వెంకటేశ్వరరావు, బద్దా వెంకట్రావు 108 వాహనంలో అప్పారావును ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఇఫ్టూ నాయకులు పి.ప్రసాద్, కె.పోలారి, ఎస్ రామ్మోహన్, ఎ.రవిచంద్ర, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.సుధాకర్ అప్పారావును పరామర్శించారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



రామకోటి ప్రాంగణంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఏలూరు (టూటౌన్): స్థానిక రామకోటి ప్రాంగణంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఎంజేఎఫ్ లయన్ మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో హెల్త్ ఆఫీసర్ బీవీ నగేష్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మొత్తం 88 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రతి నెలా రెండో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరాన్ని ఇదే ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని, దీనిని ఏలూరు, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లాయర్ శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, చెన్న వెంకట రామయ్య, బొలిశెట్టి సురేష్, అల్లం వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, ఆకుకూరల పంపిణీ

ఏలూరు (టూటౌన్): స్థానిక లెప్రసీ కాలనీ పేదలకు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం బియ్యం, ఆకుకూరలు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు టి.అబ్రహాం లింకన్, లయన్ చార్టర్ ప్రెసిడెంట్ లయన్ ప్రగళ్లపాటి మురళీ కృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. లేళ్ల వెంకటేశ్వరరావు, వీజేఎంవీ ఆర్ కృష్ణారావు, మారగాని శ్రీనివాసరావు, షేక్ ముస్తాఫా ఆలీ తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్లు తెరిచే రోజే జేవీకే కిట్లు

డీఈఓ రవిసాగర్

ఏలూరు (టూటౌన్): పాఠశాలలు తెరిచే రోజే జేవీకే కిట్లను విద్యార్థులకు అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి రవిసాగర్ అన్నారు. శనివారం ఆయన స్థానిక గ్జేవియర్‌నగర్ స్కూల్‌లోని జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను సందర్శించారు. ఆయనకు మండల విద్యాశాఖాధికారి సబ్బితి నరసింహామూర్తి స్టాక్ వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా డీఈఓ రవిసాగర్ జగనన్న విద్యాకానుక పంపిణీ విధానాన్ని రికార్డులను పరిశీలించారు. ఏలూరు అర్బన్ రూరల్‌కు 17,954 జేవీకే కిట్లకు 90 శాతం పంపిణీ చేయగా, మిగిలిన 10 శాతం కూడా పంపించే ఏర్పాట్లు చేయాలని డీఈఓ ఆదేశించారు. కిట్లు ప్యాకింగ్ ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న విద్యాకానుక టీములు చేస్తోన్న పని విధానాన్ని పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు, పీటీఐలు పాల్గొన్నారు.



గ్జేవియర్ నగర్ స్కూల్లో విద్యాకానుక స్టోరేజ్ పాయింట్‌లో బుక్స్‌ను పరిశీలిస్తున్న డీఈఓ

జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీని కలిసిన డీఈఓ

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన గంటా పద్మశ్రీ ప్రసాదరావు దంపతులను తమ క్యాంపు కార్యాలయంలో డీఈఓ రవిసాగర్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్ప గుచ్ఛం అందజేశారు. జిల్లాలో జగనన్న విద్యాకానుక, జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాలపై ప్రణాళికా బద్ధంగా వెళ్లాలని జెడ్పీ చైర్‌పర్సన్ డీఈఓకు సూచించారు. విద్యా సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ సబ్బితి నరసింహమూర్తి, జీజేఏ స్టీఫెన్ పాల్గొన్నారు.



జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాదరావులకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఈఓ రవిసాగర్

శ్మశాన వాటికల అభివృద్ధికి సహకరించాలి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని ఎస్సీలు, క్రిస్టియన్ల శ్మశాన వాటికల అభివృద్ధికి ఇతోధికంగా నిధులు అందజేసి సహకరించాలని ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జునను కోరారు. ఈమేరకు తాడేపల్లిలో మంత్రిని శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఆ వివరాలను సంతోష్ కుమార్ ఏలూరులో వెల్లడించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీలు, క్రిస్టియన్ల శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు అందించేలా విడుదల చేసిన జీఓ ప్రస్తుతం అమలు కావడంలేదని తెలిపారు. పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం అభినందనీయమన్నారు. అయితే చిన్నచిన్న కారణాలతో కొందరు పేదలకు సంక్షేమ పథకాలు అందడం లేదని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఎస్సీల అభివృద్ధికి ప్రవేశ పెట్టిన అన్ని పథకాలనూ అమలు చేయాలన్నారు. వీటిపై స్పందించిన మంత్రి నాగార్జున ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని సంతోష్ కుమార్ తెలిపారు.



మంత్రి నాగార్జునకు వినతి పత్రం అందజేస్తున్న సంతోష్ కుమార్

యువకుడి దుర్మరణం

ఏలూరు టౌన్: ఏలూరు జాతీయ రహదారిపై పనులు చేస్తోన్న ఒక యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొందరు 16 నెంబర్ జాతీయ రహదారిపై పనులు చేసేందుకొచ్చారు. శనివారం ఉదయం ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్ రత్నాస్ హోటల్ సమీపంలో డివైడర్‌పై పిచ్చి మొక్కలు తొలగించి ట్రాక్టర్ ట్రక్కులో వేస్తున్నారు. విజయవాడ నుంచి గుండుగొలను వైపు వెళ్లే ఒక కంటైనర్ అతివేగంగా ట్రాక్టర్ ట్రక్కును ఢీకొంది. ఈ ట్రక్కు పక్కనే పని చేస్తోన్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన గణేష్ (25) అనే యువకుడిపై పడింది. యువకుడు గణేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అవినీతి అధికారులపై ఫిర్యాదు

ఏలూరు (టూటౌన్): అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధి హామీ పథకం అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం కోరింది. ఈ మేరకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డ్వామా పీడీ ఎ.రాముకి శనివారం వినతి ప్రతం అందజేశారు. ఉపాధి హామీలో మండల స్థాయి అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు కూలీ నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పెదవేగి, జంగారెడ్డిగూడెం, ద్వారకాతిరుమల, లింగపాలెం, బుట్టాయగూడెం, కలిదిండి, మునినేపల్లి మండలాల్లో మండల స్థాయి అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ల కనుసన్నల్లోనే కూలీల నుంచి డబ్బులు వసూలు చేసే దందా నడుస్తోందని వివరించారు. అవినీతి అధికారులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.



డ్వామా పీడీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ, ఉపాధ్యక్షులు తామా ముత్యాలమ్మ, ఎస్.మహంకాళి, సహాయ కార్యదర్శులు తుమ్మల సత్యనారాయణ, ఎం.సుధారాణి, సభ్యులు మాధవ, సీత పాల్గొన్నారు.

12న కౌలు రైతుల పాదయాత్ర

ఏలూరు (టూటౌన్): ఈ నెల 12న విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ నుంచి మంగళగిరిలోని సీసీఎల్‌ఏ కార్యాలయం వరకు నిర్వహించే కౌలు రైతుల రాయబార కార్యక్రమ పాదయాత్రను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ కోరారు. కౌలు రైతుల రాష్ట్ర ప్రచార జాతాకు స్థానిక వసంత మహల్ సెంటర్‌లో రైతు సంఘం, సీఐటీయూ, వ్యవసాయకార్మిక సంఘం, కౌలురైతు సంఘం, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ కౌలు రైతుల చట్టాన్ని సవరించి భూయజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోని మొత్తం సాగు భూమిలో 70 శాతం కౌలుదార్ల చేతుల్లోనే ఉందన్నారు. గత కౌలు రైతు చట్టాలను రద్దు చేసి 2019లో ప్రభుత్వం పంట సాగుదారు హక్కు చట్టం తీసుకొచ్చిందని తెలిపారు. ఈచట్టం ప్రకారం భూయజమాని కౌలు ఒప్పందంపై సంతకం పెడితేనే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు వస్తున్నాయని, నూటికి 90 శాతం మంది భూ యజమానులు సంతకాలు పెట్టకపోవడంతో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు రావడం లేదని వివరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కె.శ్రీనివాస్, బి.సోమయ్య, పి.రామకృష్ణ, అంగులూరి జాన్ బాబు, బుద్దా నాగ సూరిబాబు, ఎ.గోపి, వైఎస్ కనకారావు, కొర్ని అప్పారావు, వెజ్జు శ్రీరామ చంద్ర మూర్తి, ఇందుకూరి వెంకటరామరాజు తదితరులుపాల్గొన్నారు.



వసంత మహల్ సెంటర్లో ప్రచార జాతాకు స్వాగతం పలుకుతున్న నాయకులు

అన్ని రంగాల్లోనూ దేశం అభివృద్ధి

ఏలూరు (టూటౌన్): తొమ్మిదేళ్ల మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించిందని బీజేపీ ఏలూరు అసెంబ్లీ కన్వీనర్ గాది రాంబాబు, కోకన్వీనర్ బాడిత నారాయణరావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నుదురుపాటి కృష్ణ చైతన్య పేర్కొన్నారు. స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం పార్టీ సంయుక్త మోర్చ సమావేశం బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు యెట్రించి ముఖేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశ ప్రజలకు ఎన్నో రకాల సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. సమావేశంలో తూర్పు మండల అధ్యక్షుడు లక్కోజు అనిల్ ఆచార్య, మహిళా మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇలపకుర్తి కుసుమ కుమారి, ఉపాధ్యక్షురాలు కస్తూరి అనురాధ, కార్యదర్శి కోట్నీ పార్వతి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తోట వరప్రసాద్, ఎస్సీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యువమోర్చ జిల్లా అధ్యక్షుడు కృష్ణ చైతన్య

భక్తులతో కిక్కిరిసిన శ్రీవారి క్షేత్రం



ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్యక్షేత్రం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు, వేసవి సెలవులతో సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలవడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, అనివేటి మండపం, తూర్పురాజగోపుర ప్రాంతాలతో పాటు, కేశఖండనశాల ఇతర విభాగాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు అలరించాయి. క్యూలైన్లలో భక్తులకు దేవస్థానం సిబ్బంది మజ్జిగ, మంచినీటిని పంపిణీ చేశారు. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

సైన్స్ అసిస్టెంట్‌కు హెచ్ఎంగా పదోన్నతి

దెందులూరు: చల్లచింతలపూడి ఉన్నత పాఠశాల సైన్స్ స్కూల్ అసిస్టెంట్ వడ్లపట్ల విజయ్ కుమార్‌కు శనివారం ఉంగుటూరు మండలం రాచూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పదోన్నతి లభించింది. ఈమేరకు జిల్లా విద్యాశాఖాధికారి లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. పదోన్నతి పొందిన హెచ్ఎంను సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమనారాయణ, పేరెంట్స్ కమిటీ, ఎండీఎం కమిటీ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించి ఘనంగా సత్కరించారు.

రెవెన్యూ, గృహనిర్మాణ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో సమన్వయంతో రెవెన్యూ, గృహనిర్మాణ శాఖాధికారులు సేవలందిస్తూ జగనన్న ఇళ్ల నిర్మాణాల లక్ష్యసాధనకు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శనివారం దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయంలో దెందులూరు నియోజకవర్గానికి చెందిన గృహనిర్మాణ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో జగనన్న ఇళ్ల నిర్మాణం, జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పన, గ్రామాల్లో స్థల సేకరణ, ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ, లక్ష్యాల సాధనపై దెందులూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాల వారీగా సమీక్ష చేశారు. గ్రామస్థాయిలో సమన్వయంతో పనిచేయడం వల్ల సత్ఫలితాలు లభించాయని, ఇదే స్ఫూర్తితో మరింత వేగవంతంగా జగనన్న ఇళ్ల నిర్మాణానికి లక్ష్యాల సాధనకు సేవలందించాలని కోరారు. సమావేశంలో దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, పెదవేగి ఎంపీపీ తాతా రమ్య, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కొఠారు

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ను కలిసిన ఉపాధ్యాయులు

పెదపాడు: ఉపాధ్యాయులు విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్దేందుకు తమవంతు ప్రయత్నం చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు తెలిపారు. శనివారం మండలంలోని ఉపాధ్యాయులంతా కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావును మర్యాద పూర్వకంగా కలుకుని అభినందించారు. జెడ్పీ చైర్‌పర్సన్‌ను పుష్పగుచ్ఛాలు అందించి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంగప్రసాద్, జీ సాంబశివరావు, శరత్, తోట ప్రసాద్, ఆరవల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. వడ్డిగూడెం మాజీ సర్పంచ్ మోరు పెద సుబ్బరాజు, పలువురు గ్రామ పెద్దలు జెడ్పీ చైర్‌పర్సన్‌ను సత్కరించారు. తినాతి విజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న పెదపాడు మండల ఉపాధ్యాయులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెదపాడు: మండలంలోని అప్పనవీడు శివారు తాళ్ల మూడి వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 9న బుట్టాయిగూడెం మండలం నిమ్మలవారి గూడెంకు చెందిన మొందూరు అనిల్‌కుమార్ (27) వరుసకు సోదరి అయిన జయరమ్యను వట్లూరు సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాల నుంచి మోటారు సైకిల్‌పై తీసుకు వెళ్తుండగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇరువురికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా శనివారం అనిల్‌కుమార్ మృతి చెందాడు. మృతుడి తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై కృష్ణా చల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	38	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	10
బెండకాయలు	36	కంద	40
పచ్చిమిర్చి	56-64	బీట్‌రూట్	36
కాకర కాయలు	46	కీరా దోస	40
బీరకాయలు	30-46	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	46	అల్లం	232
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	36	పాలకూర	8-10
దొండకాయలు	30	చుక్కకూర	8-10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	46	పుదీనా	05
దోసకాయలు	16	బఠాణి	--
ఆనబకాయ (1)	15	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	01
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	01
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	02
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	04
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	05
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	23
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	36
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	22
ఏలూరు -తిరుపతి	16.00	4830	36

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఒక యువకుడు పురుగుమందు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతడ్ని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. టి.నరసాపురం మండలం తిరుమలదేవిపేట పంచాయతీ వెంకటాపురానికి చెందిన దోమతోటి శ్రీను, నాగలక్ష్మి దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు రాహుల్ (19) మోటర్ మెకానిక్. గత కొంతకాలంగా అతను ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లకు బెట్టింగులు కడుతూ ఆర్థికంగా నష్టపోయాడు. అప్పులపాలు కావటంతో వాటిని తీర్చే పరిస్థితి లేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఈనెల 9న సాయంత్రం పురుగుల మందు తాగేశాడు. తీవ్ర అస్వస్థతకు గురికావటంతో రాహుల్‌ను ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా శనివారం ఉదయం మృతి చెందాడు. టి.నరసాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

24 మంది స్కూల్ అసిస్టెంట్ల చేరిక



జాయినింగ్, రిలీవింగ్ రిపోర్టులు అందిస్తున్న ఎంఈఓ

నిడమర్రు: బదిలీలు, పదోన్నతులపై 24 మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు శనివారం నిడమర్రు మండలానికి వచ్చినట్లు ఎంఈఓ పుచ్చల శేషు తెలిపారు. గణపవరం, ఏలూరు తదితర మండలాల నుంచి బువ్వనపల్లి యూపీ స్కూల్‌తో పాటు, 7 జెడ్పీ స్కూళ్లకు కొత్తగా బదిలీపై స్కూల్ అసిస్టెంట్లు వచ్చారు. వారు ఆయా పాఠశాలల్లో శనివారం విధుల్లో చేరారు. వీరికి ఎంఈఓ శేషు దిశానిర్దేశం చేశారు. మండలంలో ఖాళీగా ఉన్న సెకండరీ గ్రేడ్ పోస్టుల్లో దరఖాస్తు చేసుకున్న టీచర్లకు శనివారం రాత్రి జాయినింగ్ ఆర్డర్లు ఆన్‌లైన్‌లో అందుతాయన్నారు. వీరందరూ ఆదివారం కేటాయించిన స్కూళ్లలో హాజరు కావాలన్నారు. సోమవారం నాటికి మండలంలోని అన్ని కేడర్లలో టీచర్లు ఆయా పాఠశాలల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. సోమవారంతో ఆన్‌లైన్ బదిలీల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. భాషోపాధ్యాయుల పదోన్నతులు పూర్తవ్వాల్సి ఉందన్నారు. స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషు పదోన్నతిపై జాయినింగ్ ఆర్డర్లు తీసుకున్న వారిలో సీహెచ్ లీలాగోపాల్, సీహెచ్ భారతిలక్ష్మీకుమారి, పల్లా నరసింహమూర్తి, ఏఆర్‌కే కుమార్, బయాలిజికల్ సైన్స్ పదోన్నతి తీసుకున్నవారిలో తాడి గోపాలకృష్ణ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఏలూరు టౌన్: వట్లూరు బీసీ హాస్టల్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేట్ కంప్యూటర్ ఆపరేటర్ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. వట్లూరుకు చెందిన జి.హర్షసాయివర్ధన్ (26) ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం కళాశాల నుంచి ఇంటికి బైక్‌పై వెళుతుండగా బీసీ హాస్టల్ వద్ద మరో బైక్‌ను ఇతనిని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన హర్షసాయివర్ధన్‌ను వెంటనే ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహానికి ఏలూరు జీజీహెచ్ మార్చురీలో పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెదవేగి గురుకులం ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసరావు

పెదవేగి : పెదవేగిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్. భారతి జంగారెడ్డిగూడెం గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్లారు. శ్రీనివాసరావు కృష్ణాజిల్లా తిరువూరు నుంచి పెదవేగి వచ్చారు. ఆయన ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పీడీ కె.జయరాజు, ఉపాధ్యాయులు ఆచార్యులు, శివప్రసాద్, శ్రీనివాస్ పుష్పగుచ్ఛం అందించారు.

జూదరుల అరెస్ట్

పెదవేగి : రెండు పేకాట శిబిరాలపై దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై ఎం లక్ష్మణ్ శనివారం తెలిపారు. ప్రకాష్‌నగర్‌లో ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.7,800, దిబ్బగూడెం - లక్ష్మీపురంలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని రూ. 2,100 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.